

పత్తికుంటలో వినాయక విగ్రహాన్ని క్రేన్ సాయంతో నిమజ్జనం చేస్తున్న దృశ్యం

పత్తికుంట వద్ద ఏర్పాటు చేసిన క్రేన్



గణనాథుల వీడ్కోలుకు
సర్వం సిద్ధం

రాజేంద్రనగర్ పరిధిలో నిమజ్జనోత్సవాలు షురూ

- చెరువులు, కుంటల వద్ద పటిష్ఠ ఏర్పాట్లు
- పోలీసుల పర్యవేక్షణలో మండపాలు.. నిమజ్జన కేంద్రాలు

రాజేంద్రనగర్: గణేశ్ నిమజ్జనోత్సవాలకు రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని కుంటలు, చెరువులు సిద్ధమయ్యాయి. జీహెచ్ఎంసీతో పాటు మున్సిపల్, కార్పొరేషన్, పంచాయతీల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఏర్పాట్లను చేశారు. గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పూజలందుకున్న గణనాథులను మూడు, ఐదు, ఏడు, తొమ్మిది, పదకొండు రోజుల్లో నిమజ్జనం చేస్తారు. గణనాథుల నిమజ్జనం నేపథ్యంలో ఇరిగేషన్, పోలీసు, విద్యుత్, జీహెచ్ఎంసీ, జలమండలి తదితర అన్ని విభాగాల అధికారులు పటిష్ఠ ఏర్పాట్లు ప్రారంభించారు.

- రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని గండిపేట్, శంషాబాద్, రాజేంద్రనగర్ మండలాల్లో దాదాపు 2 వేల మండపాలను ఏర్పాటు చేశారు. ఆయా మండపాల్లో ప్రతిష్ఠించిన గణనాథుల విగ్రహాలతో పాటు చుట్టు పక్కల ప్రాంతాలకు చెందిన విగ్రహాలను నిమజ్జనానికి తరలిస్తారు.
- ప్రధానంగా పత్తికుంట, పల్లెచెరువు, కాముని చెరువు, నెక్నాంపూర్, కిస్మత్‌పూర్ ఈసీ వాగు తదితర చెరువులు ప్రధానమైనవి. ఈ చెరువులు, కుంటల్లో చిన్న, పెద్ద గణనాథు విగ్రహాల నిమజ్జనానికి భారీ ఏర్పాట్లు చేపడుతున్నారు.
- నెక్నాంపూర్‌తో పాటు రాజేంద్రనగర్‌లో ప్రత్యేక కొలనులను ఏర్పాటు చేశారు.
- రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని పత్తికుంట, పల్లె చెరువుల వద్ద గణేశ్ నిమజ్జనానికి భారీ ఏర్పాట్లు చేశారు. పత్తికుంట వద్ద నాలుగు, పల్లె చెరువుల వద్ద రెండు క్రేన్‌లను ఏర్పాటు చేసి నిమజ్జనం చేయనున్నట్లు అధికారులు తెలిపారు. 5, 7, 9, 11వ రోజుల్లో పెద్ద ఎత్తున గణనాథులు నిమజ్జనానికి రానుండటంతో అందుకు తగ్గ ఏర్పాట్లు చేశారు.
- ఈ రెండు చెరువుల్లో 2 వేలకు పైగా గణనాథులను నిమజ్జనం చేయనున్నారు. వీటితో పాటు కిస్మత్‌పూర్ ఈసీ వాగు వద్ద క్రేన్‌ను ఏర్పాటు చేసి గణేశ్ నిమజ్జనాన్ని కొనసాగించనున్నారు. గణనాథుల ప్రతిమలు అధికంగా వస్తే అందుకు అనుగుణంగా క్రేన్‌లను ఏర్పాటు చేస్తామని అధికారులు వెల్లడించారు.

వీధి దీపాల ఏర్పాటు..

గణేశ్ నిమజ్జన ఊరేగింపుతో పాటు చెరువులు, కుంటల వద్ద అధికారులు ప్రత్యేకంగా వీధి దీపాలను ఏర్పాటు చేస్తున్నారు. ఊరేగింపు ప్రధాన రహదారులపై ఇప్పటికే వీధి దీపాలకు మరమ్మతులు నిర్వహించి వినియోగంలోకి తీసుకొచ్చారు. చెరువులు, కుంటల వద్ద ప్రత్యేకంగా హైమాస్ట్ లైట్ల (టవర్ల)ను ఏర్పాటు చేసి విద్యుత్ దీపాలను అలంకరించారు. ప్రస్తుతం ఈ విద్యుత్ దీపాలతో చెరువులు, కుంటలు, రహదారులు కళకళలాడుతున్నాయి.

భారీ బందోబస్తు

నిమజ్జనంతో పాటు ఊరేగింపుల నేపథ్యంలో పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేస్తున్నారు. మైలార్‌దేవ్‌పల్లి, రాజేంద్రనగర్, అత్తాపూర్, నార్సింగ్, శంషాబాద్, శంషాబాద్ ఆర్జీఐ పోలీసుల ఆధ్వర్యంలో ప్రత్యేక పికెట్‌లను ఏర్పాటు చేశారు. చెరువులు, కుంటలతో పాటు ఊరేగింపు రహదారులపై తగు బందోబస్తును ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే చెరువులు, కుంటల వద్ద ప్రత్యేక గుడారాలను ఏర్పాటు చేసి ఔట్ పోస్టులను ప్రారంభించారు. ఈ ఔట్ పోస్టులలో ఎస్ఐ స్థాయి అధికారిని విధుల్లో నియమించారు. ఉన్నత స్థాయి అధికారుల పర్యవేక్షణలో బందోబస్తు చేపట్టారు.



నెక్నాంపూర్ చెరువు వద్ద మణికొండ కమిషనర్ ప్రదీప్‌కుమార్, మాజీ చైర్మన్ నరేందర్‌ముదిరాజ్

మూసీ ఉగ్రరూపం



నార్సింగి-పోలీస్ అకాడమీ సర్వీసు రోడ్డు వంతెన పైనుంచి వెళ్తున్న నీరు, మూసివేసిన టోల్ కేంద్రం

- గండిపేట చెరువు 8 గేట్లు తెరిచిన అధికారులు
- నార్సింగిలో సర్వీసు రోడ్లు బంద్
- మూసివేసిన ఔటర్ టోల్‌గేట్
- స్తంభించిన వాహనాల రాకపోకలు

మణికొండ: గండిపేట చెరువులోకి పరీవాహక ప్రాంతం నుంచి వరద పెరుగుతున్న కొద్దీ జలమండలి, రెవెన్యూ అధికారులు గేట్ల ఎత్తు పెంచటం, తగ్గించటం చేస్తున్నారు. గురువారం 8 గేట్లను మూడు అడుగుల మేర ఎత్తిన అధికారులు దాన్ని శుక్రవారం ఉదయం అవే గేట్లను ఐదు అడుగుల మేర ఎత్తారు. చెరువులోకి వచ్చే వరద తగ్గిపోవటంతో మధ్యాహ్నం ఒంటి గంటకు వాటిని తిరిగి మూడు అడుగుల మేరకు తగ్గించారు. సాయంత్రం 6 గంటలకు అవే గేట్లను అదే మూడు అడుగుల ఎత్తు కొనసాగించారు. పైనుంచి ఉదయం 1100 క్యూసెక్కులు వచ్చిన వరద మధ్యాహ్నానికి వెయ్యి క్యూసెక్కులకు చేరి సాయంత్రానికి 800 క్యూసెక్కులకు తగ్గింది. శుక్రవారం రాత్రికి తిరిగి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందనే సమాచారంతో 8 గేట్లను మూడు అడుగులు ఎత్తి 2704 క్యూసెక్కుల వరదను కిందనున్న మూసి నది లోకి నీటిని వదులుతున్నారు.

నార్సింగిలో ఉప్పొంగి ప్రవహిస్తున్న మూసీ..

గండిపేట చెరువు నుంచి 2704 క్యూసెక్కుల నీటిని వదలటంతో మూసీ నది నార్సింగిలో ఉప్పొంగి ప్రవహిస్తోంది. నార్సింగి మున్సిపాలిటీ కేంద్రం నుంచి మంచిరేవుల గ్రామానికి ఉన్న రోడ్డును గురువారమే మూసిన అధికారులు శుక్రవారం నార్సింగి, పోలీస్ అకాడమీ మార్గంలో ఉన్న ఔటర్ సర్వీసు రోడ్డును మూసి వేశారు. నార్సింగిలో ఔటర్‌రింగ్ రోడ్డుకు ఇరువైపులా ఉన్న సర్వీసు రోడ్డుల వంతెనలకు కిందకు ఉండటం, వాటి పై నుంచి నీరు ప్రవహిస్తుండటంతో రాకపోకలను నిలిపివేశారు. దాంతో ద్విచక్ర వాహనదారులు రాకపోకలకు కొత్త మార్గాలను వెతుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. ఔటర్ రింగ్ రోడ్డు పై నుంచి నార్సింగిలో దిగాల్సిన 18ఎ టోలుగేటును మూసి వేశారు. గండిపేట నుంచి వదర తగ్గితేనే సర్వీసు రోడ్డుపై రాకపోకలకు అనుమతిస్తామని నార్సింగి పోలీసులు తెలిపారు.



గండిపేట చెరువు నుంచి బయటకొస్తున్న నీటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

పరిశీలించిన ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్..

గండిపేట చెరువు 8 గేట్లు తెరవటంతో శుక్రవారం రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ స్థానిక నాయకులతో కలిసి చెరువును పరిశీలించారు. చెరువు కట్టపై గేట్లకు పూజలు చేసి వాటి ద్వారా కిందకు వస్తున్న నీటిని పరిశీలించారు. అనంతరం నార్సింగిలో సర్వీసు రోడ్డుపై నిలిచిపోయిన రాకపోకల వద్ద సర్వీసు రోడ్డు పైనుంచి వస్తున్న నీటిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు. గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ టి.మల్లేష్ ముదిరాజ్, నార్సింగి మున్సిపల్ కమిషనర్ టి.కృష్ణమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల సత్వర పరిష్కారానికి కృషి చేయాలి



ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌ను సన్మానిస్తున్న రాజేందర్‌రెడ్డి

బండ్లగూడ: ప్రతి నాయకుడు, కార్యకర్త నిరంతరం ప్రజల్లో ఉంటూ వారి సమస్యలను తెలుసుకొని సత్వరమే పరిష్కరించేలా కృషి చేయాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ సూచించారు. శుక్రవారం ఆయనను బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు కలిసి వివిధ సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా శాలువాలతో సత్కరించి వినాయక నవరాత్రులు సందర్భంగా గణనాథుడి పూజల్లో పాల్గొనాలని కోరారు. మాజీ కార్పొరేటర్ శ్రీనాథ్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ సంతోష్ ముదిరాజ్, స్థానిక నేత వినయ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆటో ఢీకొని వృద్ధుడికి తీవ్ర గాయాలు

మైలార్‌దేవ్‌పల్లి: వేగంగా వచ్చిన ఓ ఆటో ట్రాలీ ఢీకొన్న ప్రమాదంలో ఓ వృద్ధుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. ఎస్ నాయుడు సమాచారం మేరకు... శ్రీరాంనగర్ కాలనీకి చెందిన తిరుపతయ్య(85) టీ తాగేందుకు మెహిపిల్ హోటల్‌కు వస్తున్నాడు. ఈ సమయంలో దుర్గానగర్ నుంచి చంద్రాయణగుట్ట వైపు వెళ్తున్న ఓ ట్రాలీ ఆటో(టీఎస్09యూడీ1099) వేగంగా వచ్చి తిరుపతయ్యను ఢీకొట్టింది. ఈ సంఘటనలో ఆయన తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని గాయపడ్డ వృద్ధుడిని ఆస్పత్రికి తరలించారు. తిరుపతయ్య పరిస్థితి విషమంగా ఉంది.

పరిశుభ్రతపై అవగాహనతోనే వ్యాధులకు చెక్

బండ్లగూడ కార్పొరేషన్‌లో ఫ్రై డే డ్రై డే

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఫ్రై డే డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర అధ్యక్షతన 22వ డివిజన్ ప్రజలకు అవగాహన కల్పించారు. దోమల వల్ల కలిగే మలేరియా, డెంగీ తదితర సీజనల్ వ్యాధులు నివారించేందుకు దోమల వృద్ధి చెందే ప్రదేశాలను, పూల కుండీలు, కూలర్లు, కొబ్బరి బొండాలు, పాత టైర్లలో నిల్వ ఉన్న నీటి పారవేశారు. దీని వల్ల దోమ లార్వా దశ విచ్ఛిన్నమై వాటి ఎదుగుదల నశిస్తుంది అని వివరించారు. ఈ కార్యక్రమం వారానికి ఒకసారి ప్రతి శుక్రవారం జరుగుతుందన్నారు. ఏఎంసీ డి.చంద్రశేఖర్‌రెడ్డి, డిప్యూటీ ఈఈ జి.యాదయ్య, ఏఈఈ వి.రాజ్‌కుమార్, ఆర్‌వో కె.శివకుమార్, సూపర్‌వైజర్ అధికారులు, వార్డు అధికారులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పద్మశ్రీ కాలనీలో..

బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పద్మశ్రీహిల్స్ కాలనీలో ఫ్రై డే డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించారు. అసిస్టెంట్ కమిషనర్ డి.చంద్రశేఖర్‌రెడ్డి, రెవెన్యూ ఆఫీసర్ కె.శివకుమార్, మాజీ కార్పొరేటర్ పద్మావతిపాపయ్యయాదవ్‌లు పాల్గొని కాలనీ వాసులకు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అవగాహన కల్పించారు. పూల కుండీలు తదితర వాటిల్లోని నీటిని తొలగించారు. దోమలు పుట్టకుండా.. కుట్టకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. పరిసరాల పరిశుభ్రత ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకునే అంశాలను వివరించారు. వార్డు ఆఫీసర్ టి.శంకరయ్య, బిల్ కలెక్టర్ ఇమ్రాన్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పాపయ్యయాదవ్, ఆర్పి లావన్య, కార్యాలయ సిబ్బంది, కాలనీ నేతలు పోరెడ్డి, రాజేష్, సాయి తదితరులు పాల్గొన్నారు.



పద్మశ్రీ హిల్స్ కాలనీలో అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఆరోగ్య పరిరక్షణకు శ్రద్ధ చూపాలి

మణికొండ: ప్రస్తుత ఉరుకుల, పరుగుల జీవన విధానంలో ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని... ఆరోగ్య పరీక్షలు చేయించుకుని వైద్యుల సలహాలు, సలహాలను పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉందని మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని ఆల్ కాలనీస్ ఫెడరేషన్ అధ్యక్షుడు అర్వపల్లి వంశీ అన్నారు. శుక్రవారం ఎంజీ పార్కులో అలకాపూర్ టౌన్‌షిప్ సంక్షేమ సంఘం, ఆర్‌బీఎల్ బ్యాంక్‌లు ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మున్సిపాలిటీ వ్యాప్తంగా ఉన్న పేదలకు అవసరమైన అన్ని రకాల వైద్య పరీక్షలను ఉచితంగా నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారన్నారు. ఇళ్లల్లో పనిచేసే సిబ్బంది, వాచ్‌మెన్‌లు, డ్రైవర్లకు రూ. 6 వేల విలువ చేసే పరీక్షలు, మందులను అందజేశామన్నారు. ఇలాంటి శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆర్‌బీఎల్ బ్యాంక్ రీజనల్ మార్కెటింగ్ మేనేజర్ కె.విజయ్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ మణికొండ మున్సిపాలిటీ అధ్యక్షుడు జితేందర్, కాలనీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి డి. శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యక్షులు శశి, శేఖర్, సంయుక్త కార్యదర్శులు శ్రీధర్, సంతోష్, కోశాధికారి ప్రదీప్‌కుమార్ రెడ్డి, కార్యవర్గ సభ్యులతో పాటు బ్యాంక్ మేనేజర్ వెంకటరమణ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

నిమజ్జనోత్సవంలో అప్రమత్తంగా ఉండాలి

రాజేంద్రనగర్: గణేశ్ నవరాత్రి ఉత్సవాలను భక్తి శ్రద్ధలతో జరుపుకొని నిమజ్జనోత్సవంలో జాగ్రత్తలు పాటించాలని విద్యుత్ ట్రాన్స్‌కో ఆర్ఆర్ జోన్ సీజీఎం పాండ్యా నాయక్ అన్నారు. రాజేంద్రనగర్ డివిజన్ పరిధిలోని వినాయక నిమజ్జన చెరువులైన పత్తికుంటను ఎస్ఈ శ్రీరామ్మోహన్, డీఈ రత్నాకర్ రావు, భాస్కర్ రావు, అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ సత్యనారాయణలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా సీజీఎం మాట్లాడుతూ... గణేశ్ విగ్రహాల నిమజ్జన సమయంలో మండపాల నిర్వాహకులు విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించాలన్నారు. సమాచారం అందించినట్లయితే స్థానిక విద్యుత్ శాఖ అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకునే విధంగా ఏర్పాట్లు చేస్తారన్నారు. ఏఈ దుర్గా ప్రసాద్, లైన్‌మెన్ బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

చెత్తను ఇళ్ల వద్దకొచ్చే కార్మికులకే అందించాలి

బండ్లగూడ: ప్రజలు తమ ఇళ్లల్లోని చెత్తను నిత్యం తమ ఇంటి వద్దకు వచ్చే రిక్షా కార్మికులకు అందజేసి పరిశుభ్రతలో భాగస్వామ్యం కావాలని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర సూచించారు. 19వ డివిజన్‌లోని మైఖేల్ కాలనీలో తడి, పొడి చెత్తపై ప్రజలకు అవగాహన కల్పించారు. డిప్యూటీ ఈఈ జి.యాదయ్య, ఏఈఈ వి.కుమార్, జి.వెంకట్‌రెడ్డి, వార్డు ఆఫీసర్, బిల్ కలెక్టర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, ఆర్‌పీలు, శానిటరీ జవాన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పాపన్నగౌడ్ విగ్రహావిష్కరణ



శంషాబాద్ రూరల్: మండల పరిధిలోని ననాజీపూర్‌లో శుక్రవారం సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహాన్ని ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సర్వాయి సేవలను ఆయన కొనియాడారు. బహుజనుల చైతన్యం కోసం పాపన్న ఎంతో త్యాగం చేశారని అన్నారు. బహుజన విప్లవ వీరుడు చూపిన బాటలో నడవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు, గ్రామస్తులు, గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఆత్మహత్యకు యత్నించిన యువకుడి మృతి

మణికొండ: ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తూ హాస్టల్‌లో ఉంటున్న ఓ యువకుడు విషం తాగి ఆత్మహత్యకు యత్నించాడు. ఐదు రోజులుగా ఆస్పత్రులలో చికిత్స పొందిన ఆ యువకుడు శుక్రవారం మృతిచెందిన సంఘటన నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలోని నార్సింగి మున్సిపాలిటీ కేంద్రంలో జరిగింది. పోలీసుల సమాచారం మేరకు... వనపర్తి జిల్లా వీపనగండ్ల మండల కేంద్రానికి చెందిన మీసాల నవీన్(22) ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తూ నార్సింగిలోని ఓ హాస్టల్‌లో ఉంటున్నాడు. ఈ నెల 24వ తేదీన తెల్లవారు జామున తన గదిలో విషం తాగి పక్కనే ఉంటున్న విద్యార్థి సంతోష్‌కు తెలిపాడు. దాంతో అతన్ని కొండాపూర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి, 26వ తేదీన బహదూర్‌పల్లిలో ఉన్న ఓ ప్రైవేటు ఆస్పత్రికి, 28న నిమ్స్ ఆస్పత్రికి మార్చారు. నిమ్స్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడని, తండ్రి నాగన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించినట్టు పోలీసులు తెలిపారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు

ట్రాన్స్‌కో ఆర్ఆర్ జోన్ సీజీఎం

శంషాబాద్ రూరల్: నాణ్యతతో కూడిన విద్యుత్‌ను సరఫరా చేసేందుకు పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నట్లు ట్రాన్స్‌కో సీజీఎం పాండ్యానాయక్ వెల్లడించారు. మున్సిపాలిటీ పరిధిలోని శంషాబాద్ సబ్ డివిజన్ పరిధిలో శుక్రవారం పలు అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. పట్టణంలోని 33/11 కేవీ సబ్ స్టేషన్‌లో పవర్ ట్రాన్స్‌ఫార్మర్ కేపాసిటీని 8 ఎంవీఏ నుంచి 12 ఎంవీఏకు పెంచుతున్నట్లు ప్రకటించారు. దీంతో పట్టణ పరిధిలో సుమారు 40 వేల మంది వినియోగదారులకు విద్యుత్ సరఫరా మెరుగుపడుతుందన్నారు. రూ. 1.50 కోట్ల వ్యయంతో ఈ పనులు చేపట్టామన్నారు. శంకరాపురం సబ్‌స్టేషన్‌లో 11 కేవీ కొత్త ఫీడర్‌ను ప్రారంభించారు. రూ. 30 లక్షలతో చిన్న గోల్కొండ సబ్ స్టేషన్ పరిధిలో కొత్త ఫీడర్, రూ. 50 లక్షలతో మల్కారం సబ్ స్టేషన్ పరిధిలో కొత్త ఫీడర్ ప్రారంభించారు. ఎస్ఈ డి.ఎస్.మోహన్, డీఈలు రత్నాకర్, భాస్కర్‌రావు, ఏడీఈ రమేష్, ఏఈలు అఫ్సర్ బాషా, సురేష్‌రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం



క్రీడా దినోత్సవంలో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు

ఏజీవర్సిటీ: శ్రీ కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో శుక్రవారం జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్ చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పి.ప్రశాంత్ మాట్లాడుతూ... విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. ధ్యాన్ చంద్‌ను ఆదర్శంగా తీసుకుని దేశం గర్వించదగ్గ క్రీడాకారులు రాణించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా క్రీడా ప్రతిజ్ఞ చేయించారు. ఓఎస్ఓ కళాధర్ బాబు, పీడీ కుంభం శ్రీధర్ రెడ్డి, శ్రీరాములు బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీరాంనగర్ పాఠశాలలో..

మైలార్‌దేవ్‌పల్లి: రాజేంద్రనగర్ మండలంలోని పీఎస్ శ్రీరాంనగర్ పాఠశాలలో జాతీయ క్రీడాదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ప్రధానోపాధ్యాయుడు శంకర్, ఉపాధ్యాయులు లత, ఆశాజ్యోతి, ఎస్.కె.అల్లావలి, విద్యార్థులు పాల్గొన్నారు.

సీబీఐటీ, ఎంజీఐటీలలో...

మణికొండ: గండిపేటలోని చైతన్య భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (సీబీఐటీ), మహాత్మాగాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎంజీఐటీ) కళాశాలలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీబీఐటీలో డీన్ ఆఫ్ స్టూడెంట్స్ అఫైర్స్ డాక్టర్ లింగారెడ్డి, ఎంజీఐటీలో పీఈటీ, డాక్టర్ బర్నాబాస్‌లు మాట్లాడుతూ... క్రీడలు ప్రతి ఒక్కరికీ ఎంతో అవసరమన్నారు. చదువులతో పాటు క్రీడారంగంలో రాణించిన వారికి మంచి ఉద్యోగావకాశాలు ఉన్నాయన్నారు. సీబీఐటీలో విద్యార్థులకు, అధ్యాపకులకు పలు క్రీడా పోటీలు నిర్వహించి ప్రతిభ చూపిన వారికి ట్రోఫీలను అందజేశారు. పీఈటీ డాక్టర్ రాజేశ్వరి, విద్యార్థులు పాల్గొన్నారు. ఎంజీఐటీలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ జి.బాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రొఫెసర్ల ఉద్యోగ విరమణ వయస్సు పెంచొద్దు

ఏజీ వర్సిటీలో విద్యార్థుల ఆందోళన

ఏజీవర్సిటీ: విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్ల పదవీ విరమణ వయస్సు 65కు పెంచవద్దని తద్వారా నిరుద్యోగుల జీవితాలతో ఆడుకోవద్దని వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యార్థులు అన్నారు. ఈ మేరకు శుక్రవారం ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో విద్యార్థి జేఏసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విద్యార్థులు మాట్లాడుతూ వర్సిటీలో విద్యార్థులకు పాఠాలు చెప్పాల్సిన ప్రొఫెసర్లు తమ సొంత ఎజెండా కోసం నల్ల బ్యాడ్జీలు ధరించి ఆందోళన చేపట్టడం విడ్డూరంగా ఉందన్నారు.కొందరు ప్రొఫెసర్లు టాసా(తెలంగాణ వ్యవసాయ శాస్త్రవేత్తల సంఘం)పేరుతో వర్సిటీ అధికారులను కలిసి ఏదో ఒక అంశం పై చర్చిస్తూ పరిపాలన సక్రమంగా జరగకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం వర్సిటీల్లో పనిచేసే ప్రొఫెసర్ల పదవీ విరమణ 60 నుంచి 65కు పెంచడం అనేది కేవలం ట్రెడిషనల్ యూనివర్సిటిలకు మాత్రమే వర్తిస్తుందని తెలిపారు. దీనిని అసరాగా తీసుకుని ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా ఇటు వర్సిటీని అటూ ప్రభుత్వాన్ని తప్పుదారి పట్టిస్తూ దొడ్డిదారిలో పదవీ విరమణ వయస్సు పెంచుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. పీజీలు, పీహెచ్‌డీలు చేసిన తమకు ఉద్యోగాలు రాకుండా నోటిఫికేషన్లు వేయకుండా వర్సిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకాలు జరక్కుండా అడ్డుకోవడం అన్యాయమన్నారు. టాసా పేరుతో రాజకీయాలు మానుకోవాలని, 65 వద్దు 60 ముద్దు, రీసెర్చ్‌పై దృష్టి పెట్టు నూతన వంగడాలను కనిపెట్టు అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థి నాయకులు రాజ్‌కుమార్, కవిరాజు, శంకర్ నాయక్, లోకేష్, శ్రావణి, నవ్య, ప్రసాద్, మునీర్, భాను తదితరులు పాల్గొన్నారు.

గణనాథుడికి ఘనంగా పూజలు

గణేశ్ నవరాత్రి ఉత్సవాలు రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలో అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. మూడవ రోజు శుక్రవారం వాడవాడలా ఏర్పాటు చేసిన మండపాలలో ప్రతిష్ఠించిన వినాయక విగ్రహాలకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు చోట్ల అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. కొన్ని అపార్ట్‌మెంట్‌లు, ఇళ్ల సముదాయాల్లో నెలకొల్పిన చిన్న వినాయకులను సాయంత్రం నిమజ్జనాలకు తరలించారు. వినాయక పూజలతో అపార్ట్‌మెంట్‌లు, గేటెడ్ కమ్యూనిటీలు, కాలనీలు సందడిగా మారాయి.

– రాజేంద్రనగర్ జోన్ బృందం



ఉప్పర్‌పల్లి వెంకటేశ్వర కాలనీలో పూజలు నిర్వహిస్తున్న దృశ్యం



మణికొండ క్వార్టర్స్‌లో..



శంషాబాద్ వివేకానందకాలనీలో బీజేపీ నేతలు



కోకాపేట లెజెండ్ చైమ్స్ గేటెడ్ కమ్యూనిటీలో..



అలకాపూర్ సర్దార్ వల్లబాయ్ పటేల్ పార్క్‌లో...



హాల్ మార్క్ వినిసియా గేటెడ్ కమ్యూనిటీలో..



నార్సింగి ముప్పా ఇన్సిగ్నియా గేటెడ్ కమ్యూనిటీలో...